పచ్చిరొట్ట సాగుతో భూసారం మెండు

- రైతు సేవా కేంద్రాల్లో పంపిణీకి విత్తనాలు సిద్ధం
- గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా

బుట్టాయగూడెం: పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా గిరిజన ప్రాంతంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల పరిధిలోని గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు అందిస్తుంది. ఈ ఏడాది కూడా రైతులకు పంపిణీ చేయడం జరిగింది. పచ్చిరొట్ట సాగుపై రైతులకు పూర్తి అవగాహన కలిగించే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

చేనుకు పోషకాలు అందించడంలో కీలకపాత్ర

భూమిలో ఉన్న పోషకాలను చేనుకు సమతుల్యంగా అందించడంలో పచ్చిరొట్ట సాగు కీలకపాత్ర పోషిస్తుంది. సల్ఫర్, పాస్ఫరస్ భూమిలోని నత్రజని జింక్ వంటి సూక్ష్మ, స్థూల మూలాలన్నీ సమృద్ధిగా ఉంటాయి. అలాగే చేనుకు కావాల్సిన పోషకాలను అందించడంలో పచ్చిరొట్ట దోహదపడుతుంది. ఎరువుల వినియోగం తగ్గిపోతుంది. పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల భూమిలో వానపాముల సంఖ్య పెరుగుతుంది. అలాగే పంటకు ఉపయోగపడే మిత్ర పురుగులు భూమి పొరల్లో వృద్ధి చెందుతాయి. దీంతో భూసారం పెరిగి పంట అధిక దిగుబడులు వచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది.



పచ్చిరొట్ట పంట

పచ్చిరొట్ట సాగు ఇలా..

వరుసగా 3 నుంచి 5 సంవత్సరాల పాటు ఖరీఫ్ పంట వేసుకునే ముందు పచ్చిరొట్ట సాగు చేయాలి. పచ్చిరొట్ట విత్తనాలు వేసిన 30 నుంచి 40 రోజుల మధ్యలో పొలాన్ని దమ్ము, దుక్కి చేయాలి. ఇలా చేయడం వల్ల పచ్చిరొట్ట మొక్కలు దమ్ము మడిలో పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.

విత్తనాలు సిద్ధం

నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో రైతులకు పంపిణీ చేసేందుకు రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వీటిలో బుట్టాయగూడెం మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో జీలుగు– 225 క్వింటాలు, పిల్లిపెసర–154 క్వింటాలు, జనుము– 405 క్వింటాలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై పంపిణీ చేయనున్నారు.

పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడులు



పచ్చిరొట్ట సాగు వల్ల భూసారం పెరుగుతుంది. పంటల్లో పోషకాలు కూడా పెరుగుతాయి. దీనివల్ల అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో గిరిజన రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై విత్తనాలను అందించి పచ్చిరొట్ట సాగును ప్రోత్సహిస్తోంది.

– డి.ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

శ్రీవారి సేవలో...



వేద ఆశీర్వచనాన్ని పొందిన సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ పి.నటరాజారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తా



వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

కుక్కునూరు: వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ పేర్కొన్నారు. ఆదివారం కుక్కునూరు చర్చి హాస్టల్ ఆవరణలో పార్టీ కార్యకర్తల, నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. తొలుత ఈ సమావేశంలో ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన జవాన్‌లు మురళీనాయక్, సచిన్‌యాదవ్‌రావులకు నివాళులర్పించారు. అనంతరం తాండ్ర రాజేష్ మాట్లాడుతూ పార్టీ కుక్కునూరు మండల అధ్యక్షుడిగా తనను నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన రావు మీనావినోద్, గ్రీవెన్స్‌సెల్ సభ్యులు కోలపూడి వసంత్‌కుమార్, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు పొడియం వెంకటరమణను శాలువాతో సన్మానించారు. పార్టీ నాయకులు కుచ్చర్లపాటి కృష్ణంరాజు, రావు వినోద్, గంగుల రమణారెడ్డి, ఎల్లంకి లక్ష్మణ్ రావు, నకిరికంటి నరసింహారావు, ఆవుల బాలక్రిష్ణారెడ్డి, కోటిగిరి నళినిప్రవార్, చేకూరి నవీన్, సూర్ల రాము, పగిళ్ల అల్లేష్, బట్టు వీరబాబు, బట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుందరగిరిపై నారసింహుని జయంతి వేడుకలు



ఐఎస్ జగన్నాథపురంలో కొలువైన నారసింహునికి హారతులిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో అర్చకులు, పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అష్టోత్తర కలశ స్నపనను నిర్వహించారు. అనంతరం గర్భాలయంలోని మూలవిరాట్‌కు విశేష పంచామృతాభిషేకాలను వేద మంత్రోచ్ఛరణల నడుమ జరిపారు. ఆ తరువాత ఆలయ యాగశాలలో సుదర్శన నారసింహ ధన్వంతరీ గరుడ ఆంజనేయ అనంత సుబ్రహ్మణ్య హోమాలను నిర్వహించారు. ఆఖరిలో నీరాజన మంత్రపుష్పాలు, నక్షత్ర హారతులిచ్చారు. వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని, స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బాలామృతం ప్యాకెట్లపై విచారణ

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ఐసీడీఎస్ సెక్టార్ దిప్పకాయలపాడులోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి బాలామృతం ప్యాకెట్లపై విచారణ చేయాల్సిందిగా ఆదేశించినట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ ఆదివారం పేర్కొన్నారు. 9వ తేదీ గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన బాలామృతం ప్యాకెట్లు నిబంధనలకు విరుద్ధంగా వేరొక చోట స్టోరేజ్ చేసి ఉంచడం వివాదాస్పదం అయిందన్నారు. అయితే నిల్వ చేసి ఉంచిన బాలామృతం ప్యాకెట్లు నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా లేదా అన్నది గ్రామ కార్యదర్శి పూర్తి విచారణ చేసి నివేదికను ఇవ్వాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు.

సకల కళాకారుల సంక్షేమ సంఘ సహాయనిధి ఏర్పాటు

కొయ్యలగూడెం: సకల కళాకారుల సంక్షేమ సంఘ సహాయ నిధిని ఏర్పాటు చేసినట్లు సంఘ మండల అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిపెద్ది వెంకట రాధాకష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా సంఘ సభ్యుడు, కళాకారుడు అకాల మరణం పొందితే రూ.7 వేలు అతని కుటుంబానికి అందిస్తామన్నారు. అదేవిధంగా రాష్ట్ర సంఘం సూచించిన మండలంలోని నిరుపేద కళాకారునికి ప్రతినెలా రూ.10 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. సంఘ సభ్యులుగా నమోదు కావడానికి 98851 76178 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రాఫ్ట్ వర్క్‌పై శిక్షణ

కొయ్యలగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు క్రాఫ్ట్ తయారి పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమ్మర్ క్యాంపు శిబిరంలో భాగంగా లైబ్రేరియన్ యు రాముడుతో సహా రిటైర్డ్ ఉపాధ్యాయులు పలు అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని పెంపొందించేందుకు క్రాఫ్ట్ తయారీ దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా కళాత్మకమైన క్రాఫ్ట్ తయారీ చేసిన విద్యార్థులకు చిరు బహుమతులను దాతలు అందజేశారు.

ఉగ్రవాదాన్ని తరిమికొట్టేందుకు మద్దతు తెలపాలి



జంగారెడ్డిగూడెం: పౌర సమాజం రౌండ్‌టేబుల్ సమావేశంలో వీర సైనికులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం



చింతలపూడి: బోసుబొమ్మ సెంటర్ వద్ద మురళీధర్ నాయక్‌కు నివాళులు అర్పిస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం

జంగారెడ్డిగూడెం: దేశంలో ఉగ్రవాదాన్ని తరిమికొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం పౌర సమాజం రౌండ్ టేబుల్ సమావేశం కోరింది. ఈ చర్యకు తామంతా మద్దతుగా నిలుస్తామని, త్వరలోనే పట్టణంలో పార్టీలకతీతంగా ర్యాలీ చేపట్టి తమ సంఘీభావం తెలియజేస్తామని పేర్కొంది. పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాల్లో పాలపర్తి శ్రీనివాస్ అధ్యక్షతన పౌర సమాజం పేరుతో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీలకతీతంగా రాజకీయ ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాల్గొని పహల్గాం దాడి మృతులకు, యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్ వంటి కార్యక్రమాలకు ప్రజలంతా మద్దతు తెలపాలని పేర్కొన్నారు. దేశం నుండి ఉగ్రవాదంను తరిమి కొట్టాలంటే ప్రజలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు జెట్టి గురునాథరావు, రావూరి కృష్ణ, షేక్ ముస్తఫా, పెనుమర్తి రామ్ కుమార్, పీవీ రామలక్ష్మి, బీవీఆర్ చౌదరి, చిటికెల అచ్యుతరామయ్య, జీఎస్ఆర్ మూర్తి, అచ్యుత శ్రీనివాసరావు, అలుగు ఆనంద్ శేఖర్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్‌కు శ్రద్ధాంజలి

చింతలపూడి: ఇండియా, పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన వీరజవాన్ ఎం మురళీధర్‌నాయక్‌కు గిరిజన ఉద్యోగుల సంఘం శ్రద్ధాంజలి ఘటించింది. ఆదివారం స్థానిక బోసు బొమ్మ సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు భూక్యా రాము, దాసరి బాలకృష్ణ, నాగేశ్వరరావు, భూక్యా ఆంజనేయ నాయక్, వడిత్యా మోహన్ రావు మురళీధర్‌నాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళీ నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాలజ్ఞానంపై అధ్యయనం జరగాలి

టి.నరసాపురం: శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రచించిన కాలజ్ఞాన ఆత్మజ్ఞాన ప్రబోధాలపై లోతైన అధ్యయనం జరగాలని, ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రధాన సంచాలకులు అప్పలభక్తుల శివకేశవరావు (శివ శ్రీ) పేర్కొన్నారు. టి.నరసాపురంలో ఆదివారం జరిగిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి భక్తులు కేవలం ఆరాధనలు, అర్చనలకే పరిమితం కాకుండా ఆయన ప్రబోధాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని కోరారు. ఆయన చూపిన ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసచారి, టీస్ ఫౌండర్ కటకం శ్రీనివాసాచార్యులు, ఆలయప్రధాన అర్చకులు లక్కోజు నాగేశ్వరాచార్యులు. ఆలయ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న శివశ్రీ తదితరులు

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి విమర్శ

వేలేరుపాడు: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి కక్ష సాధింపులతో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథరావు విమర్శించారు. వేలేరుపాడు మండల పరిధిలోని భూదేవిపేటలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఒక వైపు పాకిస్థాన్ యుద్ధ వాతావరణం నెలకొని ఉన్న నేపథ్యంలో ప్రజలకు ధైర్యం చెప్పాల్సిన పాలకులు బాధ్యతారాహిత్యంగా వ్యక్తిగత కక్షలకు పాల్పడటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్ష సాధింపుల వల్ల సమాజానికే తీరని నష్టం వాటిల్లే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. కూటమి నేతల్ని మెప్పించేందుకే పోలీసు వ్యవస్థ పనిచేస్తోందన్నారు. చట్టపరంగా, న్యాయపరంగా పోలీసులు వ్యవహరించడం లేదన్నారు. ఇటీవల జరిగిన అనేక సంఘటనలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయన్నారు. కొన్ని కేసులకు సంబంధించి తప్పకుండా నోటీసులు ఇచ్చి విచారణ చేయాలని సుప్రీం కోర్టు అనేక తీర్పుల్లో చెప్పినప్పటికీ పోలీసులు పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. కాలం మారినప్పుడు ప్రతి ఒక్కరూ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుజ్జారామలక్ష్మి, ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, ఎంపీటీసీలు కొమ్మరాజు రాంబాబు, మేడవరపు నాగశ్రీ,ఎండీ షౌకత్‌హుస్సేన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వరావు, గుద్దేటి భాస్కర్, మేడవరపు బుచ్చిబాబు, కొలూరి సత్తిరాజు, జార్తి బిక్షం, మహేష్, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెట్టి గురునాథరావు

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

వేలేరుపాడు: ఇటీవల భూదేవిపేట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, తాట్కూరుగొమ్ము పంచాయతీ వార్డు మెంబర్ సన్నేపల్లి శ్రీను కుటుంబాన్ని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదివారం పరామర్శించారు. శ్రీను కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, ఎంపీటీసీలు కొమ్మరాజు రాంబాబు, మేడవరపు నాగశ్రీ, ఎండీ షౌకత్‌హుస్సేన్, పార్టీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వరావు, గుద్దేటి భాస్కర్, మేడవరపు బుచ్చిబాబు, కొలూరి సత్తిరాజు, జార్తి బిక్షం, మహేష్, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

జెట్టి పరామర్శ

కొయ్యలగూడెం: అంకాలగూడెంలోని గంటా జానకిరామ్ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి జెట్టి గురునాథరావు పరామర్శించారు. ఇటీవల జానకిరామ్ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం జెట్టి గురునాథరావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జానకిరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తోట వెంకటేశ్వరరావు, గంటా రాంబాబు, గంటా సీతారామయ్య, తాడిగడప రామకృష్ణ, సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, గంటా శంకరం తదితరులు పాల్గొన్నారు.



సన్నేపల్లి శ్రీను కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

వాహన తనిఖీలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఆదివారం పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో బస్‌లతో పాటు ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేశారు. అలాగే వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో సీఐ వి.కృష్ణబాబు ఎస్సై షేక్ జబీర్, ఎస్సై వై.మంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు. లక్కవరం, గుర్వాయిగూడెంలో ఎస్సై బి.శశాంక ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ద్వారకాతిరుమల: కార్మికుల లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సీఐటీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట భాస్కరరావు అధ్యక్షతన ఆదివారం కార్మిక, కర్షక సమావేశం జరిగింది. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని పెంచాలని, రూ. 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి సావిత్రికి మాజీ మంత్రి వనిత నివాళి

ద్వారకాతిరుమల: స్థానిక వైఎస్సార్ సీపీ మండల మాజీ యువజన విభాగ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు తల్లి సావిత్రి వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత, పార్టీ కొవ్వూరు ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పాల్గొని సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాల పార్టీ కన్వీనర్‌లు ప్రతాపనేని వాసు, వెల్లంకి సుబ్రహ్మణ్యం, నాయకులు పోల్కంపల్లి అనీల్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఇమ్మడి నాగు, బొండాడ వెంకన్నబాబు, భోగరాజు సాయికృష్ణ, బంకా అప్పారావు, పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, పెద్దిరెడ్డి రమ్య కుసుమ, పరమేశ్వరరావు, దాసరి రాంబాబు, దాసరి ఏసురత్నం, బిరుదుగడ్డ బజారియ్య, పసుపులేటి సత్యన్నారాయణ, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, షేక్ భాషా తదితరులున్నారు.



సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వనిత తదితరులు



సావిత్రికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు

సేవకు ప్రతిరూపం

జంగారెడ్డిగూడెం: విధి నిర్వహణలో ఎన్ని సవాళ్లు ఎదురైనా సేవా స్ఫూర్తికి ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తున్నారు నర్సులు. రోగులకు స్వాంతన కల్పించేలా నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివి. ఆత్మీయ పలకరింపుతో మొదలయ్యే వీరి సేవాతత్పరత, రోగి సాధారణ జీవనానికి వచ్చే వరకు కొనసాగిస్తూ ప్రతీ ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వైద్యసేవలో వీరి పాత్ర చాలా కీలకం. మే 12 అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా వారి సేవలకు సలాం చెబుదాం. తమ సేవలు గుర్తింపునిస్తూ ప్రభుత్వం అందిస్తున్న అవార్డులు తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయని, సేవా గుణానికి నిదర్శంగా నిలిచిన నైటింగేల్ పేరున అవార్డును ఇచ్చి గౌరవించడం సంతృప్తి ఇస్తుందని నర్సులు పేర్కొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న నర్సులు

ప్రజారోగ్య రక్షణే ధ్యేయంగా..



కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న సమయంలో సైతం ప్రజారోగ్య రక్షణే ధ్యేయంగా మొక్కవోని ధైర్యంతో మృత్యువుకు ఎదురెళ్లి సేవలు అందించిన వారిలో ప్రప్రథములు స్టాఫ్ నర్సులు. వైద్యారోగ్య శాఖలో రెగ్యులర్, కాంట్రాక్ట్ పద్ధతిలో స్టాఫ్ నర్సులు సేవలు అందిస్తున్నారు. స్టాఫ్ నర్సుల సేవల దృష్ట్యా వారి హోదాని నర్సింగ్ అధికారిగా మార్చి గౌరవించాలని కోరుకుంటున్నాను.

– దాగం వేణుగోపాలచారి, స్టాఫ్ నర్స్ (మేల్), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లక్కవరం

ఓర్పు, సహనంతోనే రాణించగలం



మానవసేవే మాధవ సేవ అనే సూక్తికి నిదర్శనం నర్సు వృత్తి. పనిలో ఓర్పు, సహనం, దయ, ప్రేమ ఉన్నప్పుడే ఈ వృత్తిలో రాణించగలం. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్నాను. గతంలో ఎన్నో అవార్డులు అందుకున్నప్పటికీ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది.

– మేడిది నిరీక్షణ కుమారి, స్టాఫ్ నర్సు, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి

శ్రీవారి క్షేత్రంలో పటిష్టంగా బందోబస్తు

ద్వారకాతిరుమల: శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో ఆదివారం పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ యూజే విల్సన్, స్థానిక ఎస్సై టి.సుధీర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా వాహన తనిఖీలు జరిపారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాలను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధీర్ మాట్లాడుతూ దేవస్థానం వారు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా భక్తులు వెళ్లేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

జంగారెడ్డిగూడెం: వేగవరం నోవా కాలేజీ నందు గత రెండు రోజులుగా జరుగుతున్న విషయాలపై డైట్ అండ్ బీఈడీ కోర్స్ ప్రిన్సిపాల్ డా. కట్టా శ్రీనివాసరావు స్పందించారు. కళాశాలకు పెండింగ్ ఉన్న ఫీజును చెల్లించిన వెంటనే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. 25 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను కూడా వీలైనంత త్వరగా తెప్పించి విద్యార్థులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. సర్టిఫికెట్ల విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే డైట్ అండ్ బీఈడీ కోర్స్ ప్రిన్సిపాల్ డా. కట్టా శ్రీనివాసరావు, 94415 56466 సంప్రదించవచ్చని తెలియజేశారు.

బస్‌షెల్టర్ ప్రారంభం



యడ్లగూడెంలో బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ యడ్లగూడెం గ్రామంలో నిర్మించిన పొడుం సీతారామయ్య బస్ షెల్టర్‌ను డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం సర్పంచ్ పొడుం పుష్ప తన భర్త సీతారామయ్య జ్ఞాపకార్థం ఈ బస్ షెల్టర్ తన సొంత ఖర్చులతో నిర్మించడం హర్షణీయమన్నారు. అనంతరం బస్‌షెల్టర్ ఆవరణంలో డీఎస్పీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బుగ్గ మురళీకృష్ణ, పంచాయతీ సర్పంచ్ కోరసిక శ్రీను, బోర్డు సభ్యులు మాజీ ఉపసర్పంచ్ మంగినకొండ బుజ్జారావు, మురళీ కృష్ణ, పొడుం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణలో భాగంగా మలాథియన్ స్ప్రేయింగ్ పనులు ముమ్మరంగా చేస్తున్నట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మే 1వ తేదీన ప్రారంభించిన ఈ మలాథియన్ స్ప్రేయింగ్ పనులు జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల పరిధిలోని 26 గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ పనులు పూర్తి చేశామన్నారు. సుమారు 12 మంది సిబ్బంది 2 బృందాలుగా ఏర్పడి ఈ పనులు చేస్తున్నట్లు చెప్పారు. కాగా సోమవారం జీలుగుమిల్లి మండలాల్లోని అంకన్నగూడెం, రెడ్డిగూడెం గ్రామాల్లో స్ప్రేయింగ్ పనులు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు ఈ పనులకు సహకరించాలని ఆయన కోరారు.